21062025-MAI-06_Layout 1 6/21/2025 1:27 AM Page 1

చంద్రిరాఘవరెడ్డి

రైతుల ఆశల సమాహారం కాళేశ్వరం

చరిత్రలో ఎప్పుడూ కేవలం వ్యవసాయం మీదే సంపాదించి ధనవంతులైన రైతుల ఉదాహరణలు లేవు. వ్యవసాయం జీవనాధారమనేది నిజమే. కానీ, నిజజీవితంలో మాత్రం అది కుటుంబాన్ని నిలబెట్టే స్థాయికి రాలేదు. పిల్లల చదువు, ఇంటి నిర్మాణం, పెళ్లిళ్లు, అనారోగ్య సమస్యలు, ఇవన్నీ వ్యవసాయం మీదే ఆధారపడి నెరవేరతాయా అంటే, చాలా సందర్భాల్లో కాదు. ఎందుకంటే, వ్యవసాయంలో లాభనష్టాల లెక్కలు స్పష్టంగా ఉండవు. బ్రేక్ ఈవెన్ (ఖర్చులకు సరిపడే ఆదాయం) అనే మాటే ఉండదు. ఒక్కోసారి, కొంతమంది రైతులు లాభపడినా, చాలామందికి మాత్రం అప్పులే మిగులుతాయి.

వ్యవసాయం బతుకుదెరువు వృత్తి నుంచి లాభాల మార్గంగా మారినప్పటి నుంచి రైతు బతుకు మరింతగా కష్టాల్లో కూరుకుపోయింది. నూతన ఆర్థిక విధానాల ప్రభావంతో వ్యవసాయం మునుపటిలా లేదు. లాభాల కోసం పంటలు వేయాల్సిన పరిస్థితి వచ్చింది కానీ, లాభం మాత్రం చేతికి రాలేదు. దాంతో చాలామంది రైతు కుటుంబాల్లో బాధ, నిరాశ, నిస్పృహలు అలుముకున్నాయి. పొలం చిన్నదా, పెద్దదా అనే తేడా లేకుండా, ప్రతీ రైతు ఇప్పుడు అప్పు అనే ముప్పు అంచున ఉన్నాడు. ఇది కేవలం రైతు సమస్య కాదు, మన సమాజం మొత్తం ఎదుర్కొంటున్న పెద్ద సవాలు. తెలంగాణలో పేదరికం ఒక పరిస్థితి కాదు, అదొక కుట్ర. దశాబ్దాలుగా వర్షాభావం, నీటికొరత, మార్కెట్ అసమతుల్యతలు, ప్రభుత్వాల నిర్లక్ష్యం ఇవన్నీ కలగలిసి రైతును బలహీనంగా మార్చాయి. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ పేదరికం తీవ్రత ఎక్కువగా కనిపిస్తుంది. ఇక్కడ వ్యవసాయం ఒక రకంగా జూదంలా మారిపోయింది.

> తరతరాలుగా తెలంగాణలో వ్యవసాయం అంటే కేవలం బతుకుదెరువు, లాభాల కోసం కాకుండా, కుటుంబం గడిస్తే చాలు అన్నట్టే సాగు చేసేవాళ్లు. ఇప్పటి పరిస్థితుల్లో చూస్తే, గ్రామాల్లో పది ఎకరాల కంటే ఎక్కువ భూమి సాగుచేసే రైతులు అరుదే. సగటు రైతు దగ్గర ఐదెకరాల కంటే తక్కువ భూమే ఉంటుంది.

కొంతమంది రైతులు బావులు తవ్వుకుని ఒక నీజన్‌లో వరి వేసేవాళ్లు. అదృష్టం బాగుంటే, బావిలో నీరు ఎక్కువగా ఉంటే కొంతభూమిలో రెండో పంట కూడా వేయగలిగేవాళ్లు, కానీ, అది ఖరీఫ్ కంటే తక్కువ విస్తీర్ణంలోనే. వరి అంటే ఖర్చుతో కూడిన పంట. అందుకే, నీటి సౌకర్యం ఉన్న రైతులే దాన్ని సాగు చేయగలిగారు. నీటిపారుదల కోసం బావుల మీదే ఆధారపడిన రైతులకు, నీటిని పైకి ఎత్తే పంపులు పెట్టడం అంటే పెద్ద ఖర్చే. బావులు ఉన్న రైతులు మొదట్లో మోట సహాయంతో నీళ్ల ఎత్తేవాళ్లు. తర్వాత ఆయిల్ పంపుసెట్లు వచ్చాయి. వాటితో వ్యవసాయం కొంచెం యాంత్రికంగా మారింది. అయితే, ఈ వ్యవస్థలో కూడా ఓ పరిమితి ఉంది. నీళ్లు వాలుభూములకే పారేవి. కానీ, ఆయిల్ పంపుసెట్లు వచ్చాక నీటిని ఎత్తి ఎత్తైన భూములకూ తీసుకెళ్లగలిగారు. దాంతో సాగు విస్తీర్ణం కొంచెం పెరిగింది. తర్వాత విద్యుదీకరణ వచ్చింది. అంటే, డీజిల్ కోసం పట్టణాలకి తిరగాల్సిన అవసరం తగ్గింది. మెయింటెనెన్స్ ఖర్చులు కూడా కొంత తగ్గాయి. కానీ, విద్యుత్తుతో నడిచే పంపుసెట్లు వచ్చిన తర్వాత మరో సమస్య మొదలైంది. ప్రతిరైతు తన పొలానికి నీళ్లు తేవాలనే పోటీ మొదలైంది. ప్రభుత్వం విద్యుత్తుకి సబ్సిడీలు ఇచ్చింది. వాణిజ్య పంటలు పెరిగాయి. దాంతో గ్రామాల్లో నీటివనరుల కోసం గట్టిపోటీ మొదలైంది. అందరూ వరి సాగుచేసే ప్రయత్నం చేశారు.

1980ల వరకూ తెలంగాణలో సాగు అంటే బావుల మీదే ఆధారపడిన వ్యవసాయం. కానీ, ఆ దశాబ్దం చివర్లో బోర్‌వెల్ యంత్రాలు గ్రామాల్లోకి వచ్చేశాయి. 1990ల చివరికి భూగర్భ జలాలు బాగా తగ్గిపోయాయి. కానీ, బోరు తవ్వడం ఆగలేదు. పాత బోరు ఎండిపోతే, కొత్త బోరు వేయాల్సిందే. ఇలా ప్రతి ఏడాది లోతుగా తవ్వడం, సాగునీళ్ల కోసం పోరాడటం, అన్నీ కలిసి వ్యవసాయాన్ని ఒక ప్రాణాంతక జూదంగా మార్చేశాయి. అప్పులపాలై... బోరు బావుల కోసం తిరుగుతూ ఒక స్వీయ విధ్వంసక చక్రంలో రైతులు చిక్కుకున్నారు. అంతేకాదు, వరుస కరువులు ఈ పరిస్థితిని మరింత దిగజార్చాయి. 1990 నుంచి 2015 మధ్యకాలం తెలంగాణ రైతులకు చీకటి రోజులు. నీటి కోసం పోరాటం, ప్రభుత్వాల నిర్లక్ష్యం, వివక్ష, ఇవన్నీ కలిసి వ్యవసాయాన్ని సంక్షోభం దిశగా నడిపించాయి.

నదీజలాల్లో తెలంగాణకు న్యాయం జరగలేదన్నది ఓ చేదునిజం. కృష్ణా, గోదావరి నదులు తెలంగాణ మీదుగా ప్రవహించినా, ఇవి సహజంగా దిగువకు వెళ్లేలా ఉండటంతో, ఎత్తైన పొలాలకు నీళ్లు ఎక్కించాలంటే పెద్ద కష్టమయ్యేది. దాంతో, ఈ నదుల నీరు తెలంగాణ రైతులకు కాకుండా, ఆంధ్రా ప్రాంతాల్లోని కొంతమంది పెట్టుబడిదారుల తీరని దాహాన్ని తీరుస్తున్నది. ఇది యాదృచ్ఛికం కాదు. తెలంగాణ వ్యవసాయాన్ని పట్టించుకోని ప్రభుత్వాల నిర్లక్ష్యం, నీటిపంపిణీలో అసమానతలు, ఇవన్నీ కలిసి ఈ అన్యాయాన్ని పెంచాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోని సిద్ధాంత కర్తలు, ఉద్యమకారులు ఈ వ్యవస్థపై ప్రశ్నలు వేయడం మొదలుపెట్టారు. ఇక భూముల విషయంలోనూ అదే కథ. ఆంధ్రా ప్రాంతాల్లో వ్యవసాయ ఆదాయం తగ్గిపోతుండ టంతో, అక్కడి పెట్టుబడిదారులు హైదరాబాద్ చుట్టుపక్కల భూములపై కన్నేశారు.

ఆంధ్రాలో ఒక ఎకరం అమ్మితే, తెలంగాణాలో ఐదెకరాలు వస్తాయన్న మాటలు అప్పట్లో చాలానే వినిపించేవి. దాంతో, తెలంగాణలో భూముల ధరలు తక్కువగా ఉంటే, పెద్దఎత్తున కొనుగోళ్లు జరిగాయి. హైదరాబాద్ విస్తరిస్తుందన్న అంచనాతో, తక్షణ లాభాల కంటే భవిష్యత్తు కోసం భూమిని సేకరించాలన్న పెట్టుబడిదారుల వ్యూహం స్పష్టంగా కనిపించింది. ఇది కేవలం మార్కెట్ వ్యవహారం కాదు, తెలంగాణ రైతుల భూములపై జరిగిన నిశ్శబ్ద దండయాత్ర అని చెప్పొచ్చు. అట్లాగే ఇది కేవలం వ్యక్తిగత వ్యవహారం కాదు, ప్రాంతాలకతీతంగా వర్గప్రయోజనాల కోసం సాగిన వ్యవసాయ వ్యూహం.

> తెలంగాణ రాష్ట్రం ఏర్పడే సమయానికి, ఇక్కడి పది జిల్లాల్లో తొమ్మిది జిల్లాలు వెనుకబడినవే. దీన్నిబట్టి ఇక్కడి రైతులను, వ్యవసాయాన్ని ఎంతగా నిర్లక్ష్యం చేశారో స్పష్టంగా చెప్పొచ్చు. కానీ, ఈ వాస్తవాన్ని అప్పటి మీడియా అంగీకరించలేదు. తెలంగాణ ఉద్యమంలో నీళ్ల ఒక ప్రధాన నినాదం అయినా, దాన్ని కూడా వ్యక్తిగత, రాజకీయ లాభాల కోసం నడిపిన నినాదంగా చూపించేందుకు ప్రయత్నించారు. ఇది కేవలం నీటి కోసం పోరాటం కాదు, తెలంగాణ రైతు గౌరవం కోసం సాగిన ఉద్యమం.

ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరం ప్రారంభమైన తర్వాత, ఎండిపోయిన పొలాలు, ఆశలు కోల్పోయిన రైతుల బతుకుల్లో కొత్త వెలుగు వచ్చింది. సాగు కోసం ఎదురుచూపులు, నీటి కోసం పోరాటం, ఇవన్నీ కాళేశ్వరం వల్ల చాలా వరకు తగ్గాయి. ఈ ప్రాజెక్టుకు రూపురేఖలు ఇచ్చింది తెలంగాణ ఇంజినీర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా అప్పటి కేసీఆర్ ప్రభుత్వ దార్శనికత. బ్యారేజీలు, పంపింగ్ స్టేషన్లు, రిజర్వాయర్లు, కాలువలు, ఇవన్నీ కలిపి ఎన్నో దశల్లో నీటిని ఎత్తి, పొలాలకు తీసుకెళ్లేలా చేసిన ప్రణాళిక ఇది. కాళేశ్వరం కేవలం ఓ ప్రాజెక్టు కాదు, తెలంగాణ రైతు గర్వానికి నిలువెత్తు నిదర్శనం. ఈప్రాజెక్టును ముందుకు నడిపించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దుష్ప్రచారాలను, కోర్టు కేసులను ఎదుర్కొంటూ, ప్రతి దశను స్వయంగా పర్యవేక్షిస్తూ, దీన్ని నిజంగా రైతుకు ఉపయోగపడేలా చేశారు. ఆ దృఢసంకల్పం లేకపోతే, ఈ స్థాయిలో వ్యవసాయాన్ని ఊహించడమే కష్టం.

2019 జూన్‌లో ప్రారంభమైన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం తెలంగాణ వ్యవసాయరంగానికి నిజంగా గేమ్‌చేంజర్. ఈ ప్రాజెక్టు వల్ల రాష్ట్రంలో పంటల ఉత్పత్తి బాగా పెరిగింది. ముఖ్యంగా ఆహారధాన్యాల విషయంలో కేంద్ర వ్యవసాయ శాఖ డేటా ప్రకారం, 2018-19 నుంచి 2023-24 మధ్యకాలంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి పది రాష్ట్రాల్లో అత్యధిక వృద్ధిరేటు సాధించింది. అంటే, కాళేశ్వరం నీళ్లు పొలాల్లోకి వచ్చాక రైతుల ఆశలు పంటలుగా మారాయి. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం వల్ల తెలంగాణలో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. కాలువల ద్వారా, చెక్‌డ్యామ్‌లతో వాగులు, వంకల ద్వారా నదులు నిండటంతో భూగర్భ జలాలు నిలకడగా మారాయి. దాంతో వరుసగా నాలుగేండ్లుగా వరి దిగుబడులు రికార్డుస్థాయిలో నమోదవుతున్నాయి. కాళేశ్వరం నీళ్లు మాత్రమే కాకుండా రైతుబంధు, రైతు బీమా లాంటి పథకాలూ రైతులకు ధైర్యం ఇచ్చాయి. దాంతో తెలంగాణ వ్యవసాయ వృద్ధిరేటు నాలుగు శాతంగా ఉన్న జాతీయ సగటును దాటి 7.8 శాతానికి చేరింది.

> కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల కేవలం పంట దిగుబడులు పెరగడమే కాదు, భూగర్భజలాలు కూడా మెరుగయ్యాయి. రిజర్వాయర్లు నిండడంతో, చెరువులు, వాగులు తిరిగి జీవం పొందడంతో, భూమిలో నీటిమట్టం సగటున 4 మీటర్లకు పైగా పెరిగిందని హైడ్రోలాజికల్ అధ్యయనాలు చెబుతున్నాయి. ఇంకా ముఖ్యంగా చెప్పుకోవాల్సింది ఏంటంటే, ఫ్లోరైడ్ సమస్య. చాలా జిల్లాల్లో భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండేది. ఇప్పుడు నీటిమట్టం పెరగడంతో, ఆ కాలుష్యం స్థాయిలు తగ్గాయి. ఇది ఆరోగ్యపరంగా చాలా పెద్ద ఊరట.

నీటి లభ్యత పెరగడంతో రైతుల ఆత్మహత్యల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. దేశవ్యాప్తంగా చూస్తే, ఈ విషయంలో తెలంగాణే అత్యంత స్పష్టమైన మెరుగుదల చూపిన రాష్ట్రంగా నిలిచింది. వ్యవసాయ పునరుజ్జీవానికి ఇది ఒక మంచి ఉదాహరణ. కాళేశ్వరం నీళ్లు పొలాల్లోకి వచ్చాక పంటల ఉత్పత్తి బాగా పెరిగింది. దాంతో ఎరువులు, విత్తనాలు, ట్రాక్టర్లు, పంటల మందులు లాంటి వ్యవసాయ ఇన్‌పుట్లకు డిమాండ్ పెరిగింది. ఈ డిమాండ్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చింది. సాగు విస్తీర్ణం పెరగడంతో పొలాల్లో పనిచేసే కూలీలకు పని దొరికింది. అలాగే ఇన్‌పుట్స్ సరఫరా చేసే వ్యాపారాలు పెరిగాయి.

కాళేశ్వరం వల్ల రైతులకు కనిపించని లాభాలు కూడా ఉన్నాయి. గత ఐదేండ్లలో సగటు రైతు కనీసం లక్ష రూపాయలు ఆదా చేశాడని అంచనా. ఎందుకంటే, భూగర్భ జలాలు నిలకడగా ఉండకపోతే, ప్రతి రైతు కొత్త బోరు వేయాల్సి వచ్చేది. తెలంగాణలో బోరు తవ్వడం అంటే కనీసం లక్ష రూపాయలు సమర్పించుకోవాల్సిందే. ఆ ఖర్చు తప్పించుకోవడం కూడా రైతుకి పెద్ద ఊరటే. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల పంటలే కాదు, తెలంగాణ గ్రామాల ఆర్థిక పరిస్థితి కూడా బాగా మారిపోయింది. రైతుల ఆదాయం పెరగడంతో వాళ్ల కొనుగోలు శక్తి కూడా పెరిగింది. కిరాణా, బట్టలు, ఎలక్ట్రానిక్స్, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, టీవీలు, అలాగే ఇల్లు కట్టేందుకు సిమెంట్, ఇనుము లాంటి వస్తువుల కోసం సమీప పట్టణాల్లో ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. దాంతో రిటైల్ షాపులు, రవాణా, కట్టడాల రంగాల్లో పట్టణాల్లో గిరాకీ పెరిగింది. ఇది ఉద్యోగాలు పెరగడానికి, చిన్న వ్యాపారాలు బలపడడానికి దోహదం చేస్తున్నది.

కాళేశ్వరం వల్ల తెలంగాణలో వ్యవసాయం పూర్తిగా మారిపోయింది. ఎన్నో ఏండ్లుగా కష్టాల్లో ఉన్న రైతుల జీవితాల్లో వెలుగు వచ్చింది. ఎప్పుడూ నీటికోసం ఎదురుచూసే రోజులు పోయి, ఇప్పుడు పంటలకు నమ్మకమైన సాగునీరు అందుతున్నది. వరిసాగు విస్తరించింది. కొత్త రకాల పంటలు వేయడం మొదలైంది. ధాన్యం ఉత్పత్తి బాగా పెరిగింది. తెలంగాణ ఇప్పుడు వ్యవసాయరంగంలో దేశంలో ముందున్న రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. రైతులపై అప్పుల భారం తగ్గింది. పర్యావరణానికి కూడా ప్రయోజనం చేకూరింది. గ్రామాల్లో ఆర్థికచైతన్యం వచ్చింది. పనుల అవకాశాలు పెరిగాయి, పట్టణాల అభివృద్ధికి కూడా తోడ్పడింది. చాలాకాలం తర్వాత రైతు కుటుంబాలు ఆర్థికంగా కొంత ఊపిరి పీల్చుకుంటున్నాయి. వాళ్ల ముఖాల్లో ఆనందం కనిపిస్తున్నది. పండగలా జీవితం సాగుతున్నది. కాళేశ్వరం తెలంగాణ అభివృద్ధికి అంకితమైన రాజకీయ నాయకత్వ ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలుస్తున్నది.

స్వాతంత్ర్యానంతర భారతదేశంలో 'జై కిసాన్', రైతే రాజు' వంటి నినాదాలు వినిపించినా, అవి కార్యరూపం దాల్చక, అధికార యంత్రాంగం, ఎన్నికల రాజకీయాల గోడలను దాటలేకపోయాయి. 'జై కిసాన్' అనేది 'నై కిసాన్'గా మారిపోయింది, రైతేరాజు కాస్తా వ్యవసాయ కూలీగా దిగజారిపోయాడు. కుల రాజకీయాలు ప్రాధాన్యం పొందిన తర్వాత, వ్యవసాయ రంగానికి రాజకీయ ప్రాధాన్యం తగ్గిపోయింది. ఈ పరిస్థితికి మినహాయింపు తెలంగాణ ఉద్యమం. నీటిని మూడు ఉద్యమ నినాదాల్లో ఒకటిగా చేర్చారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అదే ఉద్యమస్ఫూర్తితో సాగునీటి రంగంపై దృష్టిపెట్టిన తొలి తెలంగాణ ప్రభుత్వం కృషి ఫలితంగా కాళేశ్వరం రూపుదిద్దుకుంది. కాబట్టి కాళేశ్వరం ఒక నీటిపారుదల పథకం మాత్రమే కాదు, ఇది తెలంగాణ రైతులపై వివక్షకు, నిరాదరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి నిలువెత్తు చిహ్నం.

(వ్యాసకర్త: సమాజశాస్త్ర విభాగం ప్రొఫెసర్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం)

ఇప్పుడొక జన శంకరుడు కావాలి!

నూర శ్రీనివాస్

ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో నిరంతరంగా ప్రవహించిన జీవనది ఆచార్య కొత్తపల్లి జయశంకర్. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచినవాడు. తెలంగాణకు జరిగిన అన్నిరకాల అసమానతలను కండ్లారా చూసి సాక్షీభూతుడిగా మిగిలిపోలేదు. ఉమ్మడి పాలకుల పాపాలను ఒక్కొక్కటిగా చిత్రపటుని వలె లెక్కగట్టిండు. తెలంగాణే శ్వాసగా జీవితాంతం బతికి తెలంగాణ రాష్ట్రం భవిష్యత్తు ఎలా ఉండాలో నిర్దేశించుకునే రోడ్‌మ్యాప్‌నకు ముడిసరుకు అందించి వెళ్లారు. ఇప్పుడా ముడిసరుకులో అత్యంత ప్రధానమైన నీరు తెలంగాణ ప్రమాదపు అంచులో ప్రవహిస్తున్నది. గోదావరి, కృష్ణాజలాల విషయంలో ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న నష్టాన్ని భర్తీ చేసే శాశ్వత కార్యాచరణకు దారులు తీయవలసిన అనివార్యత నెలకొన్నది. తెలంగాణలోని ఏ ప్రాంతం ఏ బేసిన్‌లో ఉందో? ఏ నది బేసిన్‌లో ఏ ప్రాజెక్టు ఉన్నదో అందరి ముందూ అడిగి చెప్పించుకోవాల్సిన ఏలికలు పాలిస్తున్న సందర్భంలో జయశంకర్ సార్‌ను మరిచిపోకుండా మళ్లీ మళ్లీ గుర్తుచేసుకోవాలి.

తెలంగాణలో 2014 జూన్ 2వ తేదీకి ఎంత ప్రాముఖ్యత ఉన్నదో.. 2019 జూన్ 21కి అంతే ప్రాముఖ్యత ఉన్నది. ఒకటి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైతే, రెండోది కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించుకున్న తేదీ. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి మూడేండ్ల ముందు, రాష్ట్రం ఆవిర్భవించిన ఐదేండ్ల తర్వాత ఇదే జూన్ 21వ తేదీన తెలంగాణ అంతర్యంత కలవరపాటుకు గురైంది. కన్నీరుమున్నీరుగా ప్రవహించింది.

> 1952 నుంచి 1969 దాకా, 1996 నుంచి 2001 దాకా, 2001 నుంచి 2011 దాకా నాలుగు తరాల నేతలతో, ఉద్యమకారులతో కలిసి పనిచేసి తెలంగాణే శ్వాసగా బతికిన మహోన్నతుడు ఆచార్య జయశంకర్ సార్ మరణించింది జూన్ 21వ తేదీనే. 'నీళ్లు.. నిధులు.. నియామకాలు'.. ఇది తెలంగాణ ఉద్యమ ట్యాగ్‌లైన్.

ఆరు దశాబ్దాలపాటు తెలంగాణకు జరిగిన అన్యాయాలను అంకెలు, సంఖ్యలు సహా సహేతుక, శాస్త్రీయ ఆధారాలతో ప్రపంచానికి చాటిన ఆచార్య జయశంకర్ సార్ నడుస్తున్న తెలంగాణ చరిత్రను ఎట్లా చూసేవారు? ఒక మహావృక్షం కూలిపోతే ఎంత వెలితి ఉంటుందో అంత వెలితిని ఇవ్వాళ తెలంగాణ అనుభవిస్తున్నది.

తెలంగాణలో కృష్ణమ్మతో గోదావరి కరచాలనం చేసింది. ఆ కరచాలనమే కాళేశ్వరం. గోదావరి, కృష్ణా బేసిన్లను కాళేశ్వరం కలిపేసింది. ఇప్పుడా చరిత్ర మసకబారుతున్న కాలం. అక్కడెక్కడో రాజస్థాన్ బిడ్డ.. వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ చెప్పేదాకా జలవిప్లవ సౌందర్యాన్ని గమనించలేదు. ఇప్పుడు బనకచర్ల బంకరా క్షసిలా, జలగలా గోదావరిని పీల్చేస్తున్నదని చెప్పినా చెవికి ఎక్కనితనం వెక్కిరిస్తున్నది. కేంద్రంతో సంబంధం లేకుండానే రాష్ట్రాలు సఖ్యతతో ఉంటే ఎంతటి జఠిలమైన జల సమస్యనైనా పరిష్కరించుకోవచ్చన్న సందేశాన్ని కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా తెలంగాణ ఇచ్చింది. ప్రజల యోగక్షేమాలే పరమావధిగా నమ్మే పాలకులు ఏ దిశగా అడుగులు వేయాలో ఆ సందర్భంగా తెలంగాణ ఆచరించి చూపింది. మేడిగడ్డ తెలంగాణ జీవగడ్డ మాత్రమే కాదు, నీటి పరిష్కార మార్గాన్ని చూపిన నిలువెత్తు జల సంతకమని తెలంగాణ నిరూపించింది. మహా రాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో శత్రుపూరిత వైఖరిని ప్రదర్శించడం ఏ మాత్రం సరికాదని తెలంగాణ భావించింది.

సమస్యల శాశ్వత పరిష్కారానికి సరిహద్దు రాష్ట్రాలతో మైత్రి దోహదపడాలని తెలంగాణ భావించింది. కనుకనే ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఆహ్వానించింది. కానీ, ఇవ్వాళ జరుగుతున్నదేమిటి?

> తెలంగాణ జీవితం పట్ల, తెలంగాణ భాష పట్ల, సంస్కృతి పట్ల జయశంకర్ సార్‌కు ఉన్న లోతైన ఆత్మీయ అవగాహన ఇప్పుడెవరికి ఉన్నది? తెలంగాణ వనరుల పట్ల, వనరుల దోపిడీ, విధ్వంసాల పట్ల జయశంకర్ సార్‌కు ఉండే మ్యాథమెటికల్ అండ్ సైంటిఫిక్ ప్రమాణాలు ఎవరికున్నాయి? ఏ మేధావికి ఉన్నది?

నిజానికి మేధావి అంటే తను ఒప్పుకోరు. తెలంగాణ ఉద్యమానికి బుద్ధిజీవులు లేదా మేధావులు ఒక్కటిగా ఉండాలని ప్రయత్నాలు సాగిస్తున్నకాలంలో అనేక సంఘాలు, సంస్థలు ఏర్పడుతున్నాయి. ఆ క్రమంలో కొంతమంది తెలంగాణ 'మేధావుల' సంఘాన్ని ఏర్పాటు చేద్దామని ప్రతిపాదన వస్తే 'మనకు మనమే మేధావులు అనుకుంటే అతి అనిపిస్తది. మేధావులకు బదులు విద్యావంతులు అందాం' అని వారు సూచించటం వల్లనే ఆ ఏర్పడిన సంస్థకు 'తెలంగాణ విద్యావంతుల వేదిక' అని నామకరణం చేసుకున్నారు. 'బోధించు.. సమీకరించు.. పోరాడు' అని దేశ సామాజిక ఉద్యమాలకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నినదిస్తే తెలంగాణ ఉద్యమంలో అదే సమానార్థకంలో 'భావజాలవ్యాప్తి.. ఆందోళన.. రాజకీయ ప్రక్రియ' అనే దశల్ని నిర్ధారించి తెలంగాణ జనశంకరుడయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును చూసే చనిపోవాలన్న ఆయన కోరిక నెరవేరకుండానే వెళ్లిపోయారు. లేదంటే తెలంగాణ పట్ల ప్రస్తుత పాలకులు అనుసరిస్తున్న వైఖరిని చూసి గుండెపగిలేవారు.

తెలంగాణ ఉద్యమానికి ఆనాడు జయశంకర్ సార్ విద్యావంతుల వర్గంపై ఆధారపడ్డారు. అది ఏ వర్గమైనా జయశంకర్ సార్‌ను ఆమోదించింది. జయశంకర్ సార్ వారసత్వాన్ని కొనసాగించే బాధ్యత ఇప్పుడు ఎవరు తీసుకుంటారు? రాజకీయ పార్టీలకు వ్యూహప్రతివ్యూహాలు ఉంటాయి. జిత్తులమారి ఎత్తుగడలూ ఉంటాయి. వాటి మధ్య తెలంగాణ ప్రయోజనాలు నలిగిపోకుండా బుద్ధిజీవులు, రాజకీయార్థుల ప్రయోజనాలకు అతీతంగా లేదా సమాంతరంగా కేవలం తెలంగాణ కేంద్రంగా నేతృత్వాన్ని అందించగల అందరివాడు కావాలి? తెలంగాణ మునుపెన్నడూ లేని అటువంటి లోటును గడిచిన కొంతకాలంగా అనుభవిస్తున్నది. వ్యక్తులు, సంస్థలు శిబిరాలుగా, సమూహాలుగా విడిపోయి ఎవరినీ అంగీకరించలేని స్థాయికి తెలంగాణ విద్యావంతుల సమాజం జారిపోయింది. జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించి, ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో తిప్పుకుంటూ సంబురపడిపోయే సమూహాలు కాకుండా తెలంగాణకు జయశంకర్ సార్ అందించిన స్ఫూర్తిని గురించిన చింతనాపరుల ఆవశ్యకత ఏర్పడింది. తెలంగాణ గౌరవాన్ని, సమాజ వ్యక్తిత్వాన్ని, ప్రజాస్వామ్యతత్వాన్ని, పవిత్రతను చారిత్రక అంశగా స్వీకరించే సహృదయుల సాంగత్యం తెలంగాణకు ఇప్పుడే ఎక్కువ అవసరంగా కనిపిస్తున్నది.

(నేడు ఆచార్య జయశంకర్ సార్ వర్ధంతి)

కన్నీటి వ్యథ తీరి నేటికి ఆరేండ్లు

డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్

2019 జూన్ 21.. తెలంగాణ చరిత్ర గతిని మార్చిన రోజు. కరువుతో అల్లాడిన తెలంగాణ నేల తల్లి నీటి వ్యథ, తెలంగాణ ప్రజల కన్నీటి వ్యథ తీరిన రోజు ఇది. గోదారమ్మ ఉవ్వెత్తున ఎగిసిపడి తెలంగాణ ప్రజల కన్నీళ్లను తుడిచిన శుభదినమిది. దశాబ్దాల జలకల సాకారమై కేసీఆర్ అపర భగీరథుడిగా సాక్షాత్కారమైన రోజు ఇది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి జలాలతో కాళేశ్వరుడి పాదాలు కడిగిన రోజు ఇది. తెలంగాణ జీవనాడి కాళేశ్వరాన్ని జాతికి అంకితం చేసి నేటికి సరిగ్గా ఆరు వసంతాలు పూర్తయ్యాయి.

అప్పటికీ, ఇప్పటికీ ఎంత తేడా. నాడు కరువుతో అల్లాడిన భూముల్లో నేడు కాసుల పంటలు పండుతున్నాయి. నాటి బీడు భూముల్లో నేడు బంగారం విరగబూస్తున్నది. ఒకనాటి వలసల తెలంగాణకు నేడు ఇతర రాష్ట్రాలవారు వలస వస్తున్నారు. ఒకప్పుడు గొంతెండిన నేలపై నేడు నిండు వేసవిలోనూ మత్తళ్లు దుంకుతున్నాయి. స్వరాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తెలంగాణకు ఎదురైన మొదటి సవాలు సాగునీటి సమస్య. నీళ్లున్నా మన నేలపై నిలవని పరిస్థితి. ఉమ్మడి పాలకులు ఒకటి అరా ప్రాజెక్టులు కట్టినా నీళ్ల పారని దుస్థితి. నీళ్లు లేని చోట ప్రాజెక్టులు కట్టిన సమైక్య పాలకులు తెలంగాణను ఎండబెట్టారు, తెలంగాణ రైతాంగాన్ని పాడెక్కించారు. ఇలాంటి పరిస్థితుల్లో పాలనా పగ్గాలు అందుకున్న కేసీఆర్ నీళ్ల కోసం భగీరథ ప్రయత్నమే చేశారు. నాటి భగీరథుడు దివి నుంచి భువికి గంగను తీసుకొస్తే.. అభినవ భగీరథుడు పాతాళంలోని గంగను పొలాలకు పారించారు. అప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించింది. కానీ, కమీషన్ల కోసం తల లాంటి ప్రాజెక్టును వదిలేసి తోక వంటి కాలువలను తవ్వి కాసులు వెనుకేసుకున్నది. మరోవైపు మహారాష్ట్ర నుంచి అభ్యంతరాలు.

> ఈ నేపథ్యంలో తెలంగాణలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కేసీఆర్ సంకల్పించారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీ కడితే వందల టీఎంసీల నీటిని ఒడిసిపట్టుకొని ఎత్తిపోయవచ్చని గ్రహించారు. కేంద్రం నుంచి అనుమతుల కోసం అహర్నిశలూ శ్రమించారు, సాధించారు.

రైతులను ఒప్పించి, మెరుగైన ప్యాకేజీ ఇచ్చి భూసేకరణ చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులకు లోటు రానివ్వలేదు. సమర్థుడైన హరీశ్‌రావును నీటిపారుదల శాఖ మంత్రిగా నియమించి ఎల్లవేళలా ప్రాజెక్టు పనులను పర్యవేక్షించారు. చిన్న చిన్న ప్రాజెక్టుల నిర్మాణాలకే దశాబ్దాలు పడుతున్న ఈ అనిశ్చిత రాజకీయ వ్యవస్థలో మూడేండ్లలోనే జలయజ్ఞాన్ని పూర్తి చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉద్దేశం పంటలకు నీరందించడం మాత్రమే కాదు, తెలంగాణ పునర్నిర్మాణం కూడా. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన జలాశయాలు, కాలువలతో తెలంగాణలో భూగర్భ జలాలు పెరిగాయి. తద్వారా బోరుబావుల్లో నీటి లభ్యత పెరిగింది. కాళేశ్వరం నీటిని మిషన్ భగీరథకు అనుసంధానించడం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులోకి వచ్చింది. ఇది ప్రజల ఆరోగ్యాన్ని, ప్రజల జీవనప్రమాణాలను మెరుగుపరిచింది. తద్వారా వారు అన